
నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 27 మార్చి 2024 | KAMAREDDY

- టికెట్ ఎవరికివ్వాలనే దానిపై సందిగ్ధత
- బీజేపీ కోసమే జాప్యం చేస్తున్నట్లు ప్రచారం
- అధికార పార్టీ శ్రేణుల్లో తీవ్ర గందరగోళం
- ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్
- నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటనలు
- శ్రేణులతో మమేకమవుతున్న బాజిరెడ్డి, అనిల్‌కుమార్



# చేతిలెత్తేశారా?

## నిజామాబాద్ అభ్యర్థిని తేల్చని కాంగ్రెస్

**లోక్‌సభ** ఎన్నికల ముంగిట కాంగ్రెస్‌లో గందరగళం నెలకొన్నది. నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థిత్వం ఖరారుపై అంతులేని సందిగ్ధత కొనసాగుతున్నది. బీఆర్ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో దూసుకు పోతుండగా, హస్తం గుర్తుపై పోటీ చేసేదెవరో తేల్చకుండా అధికార పార్టీ మల్లగుల్లాలు పడుతున్నది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బొటాబొటి మెజార్టీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికలు అగ్నిపరీక్షగా మారాయి. ప్రతిపక్షాల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించాల్సి ఉండగా, క్యాండిడేట్లు లేక విలవిల్లాడుతున్నది. జగిత్యాల జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వైపు మొగ్గు చూపుతున్నట్లు కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నా.. ఆ పార్టీ నాయకత్వం ఎటూ తేల్చకుండా నాన్చుతున్నది. ప్రతిపక్ష బీఆర్ఎస్ 17 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయడమే కాదు.. క్షేత్ర స్థాయిలో ప్రచారంతో హోరెత్తిస్తున్నది. అయితే, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇంకా సస్పెన్స్ కొనసాగిస్తుండడంపై హస్తం పార్టీ కార్యకర్తలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 2019 ఎన్నికల మాదిరిగా తెర వెనుక బీజేపీకి సపోర్టు చేసే వ్యూహంలో భాగంగానే ఇదంతా జరుగుతున్నట్లు అనుమానిస్తున్నారు. గత ఎన్నికల్లో నిజామాబాద్‌లో బీజేపీ గెలుపు వెనుక హస్తం సపోర్టు ఉందన్నది జగమెరిగిన సత్యం. ఇప్పుడు కూడా అదే ఒరవడిని కాంగ్రెస్ నడుస్తున్నదని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు.

నిజామాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**కాంగ్రెస్, బీజేపీ బేజారు..**

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడి పది రోజులవుతున్నా రాజకీయ పార్టీల సందడి అంతంత మాత్రంగానే కనిపిస్తున్నది. అధికార పార్టీలో అంతా స్తబ్దుగానే ఉండగా, 'కారు' జోరుగా దూసుకెళ్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోయినప్పటికీ లోక్‌సభ ఎలక్షన్లలో మెజార్టీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా గులాబీ పార్టీ సన్నాహాలు ప్రారంభించింది. బీజేపీ, కాంగ్రెస్‌లకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రణాళికలను రచిస్తున్నది. షెడ్యూల్ రాక ముందే జహీరాబాద్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్‌ను, నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్ పేరును కేసీఆర్ ఖరారు చేశారు. ఆ ఇద్దరు నేతలు ఇప్పటికే కదనరంగంలో అడుగు పెట్టారు. మరోవైపు, నిజామాబాద్ లోక్‌సభకు కనీసం అభ్యర్థిని ప్రకటించుకోలేని దుస్థితిలో కాంగ్రెస్ కొట్టుమిట్టాడుతున్నది. ఢిల్లీ పెద్దలతో మాట్లాడేందుకు రేవంత్‌రెడ్డి పలుమార్లు వెళ్లినా కొలిక్కి రాలేదు. పోటీకి ముందుకొచ్చిన మానాల మోహన్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, అన్వేశ్‌రెడ్డిలకు కార్పొరేషన్ పదవుల ఆశను చూపి వారిని పక్కకు జరిపారు. పార్టీ తరఫున అభ్యర్థిని ఖరారు చేసే విషయంలో జాప్యం చేస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, బీజేపీ అభ్యర్థిగా అర్వింద్ పేరును ఖరారు చేశాక పార్టీలో అసంతృప్తి రెట్టింపయింది. ఎట్టి పరిస్థితుల్లోనూ అర్వింద్ గెలుపు కోసం పని చేసేదే లేదంటూ బీజేపీ నేతలే బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. జహీరాబాద్‌లో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులైతే పత్తా లేకుండా పోయారు.

**బీఆర్ఎస్ జోరు..**

బీఆర్ఎస్ అభ్యర్థులు బాజిరెడ్డి గోవర్ధన్, గాలి అనిల్‌కుమార్ ప్రచారంలో జోరు పెంచారు. నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలను కలుపుకొని పోతూ వారి సలహాలు, సూచనలను తీసుకుంటున్నారు. అసంతృప్తితో ఉన్న నేతలను సముదాయించుకుంటూ సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండడంతో ఆయా చోట్ల మండలాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ ముందుకెళ్తున్నారు. మరోవైపు, పార్టీ అభ్యర్థుల తరఫున కేసీఆర్ ప్రచారం చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను ఎండగట్టడంతో పాటుగా బీఆర్ఎస్ అభ్యర్థుల కోసం క్షేత్ర స్థాయిలో పర్యటించనున్నారు. కాంగ్రెస్ తెచ్చిన కరువును ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటుగా కరెంట్ కటకట, సాగునీటి కొరత, పంట పొలాలకు దక్కని భరోసా, రుణమాఫీ హామీపై కాంగ్రెస్ పార్టీ దాటవేత, బోనస్ హామీపై బోగస్ ప్రకటనలను అస్త్రాలుగా మలచుకుని కాంగ్రెస్, బీజేపీల తీరును ఎండగట్టేందుకు బీఆర్ఎస్ రెడీ అవుతోంది. నిజామాబాద్ లోక్‌సభ సీటును కైవసం చేసుకోవడం, జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీ స్థానాన్ని పదిలంగా కాపాడుకునేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకెళ్తున్నది.

# జహీరాబాద్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తాం

- గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం..
- మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి
- బేమాన్ బీబీపాటిల్.. చేసింది శూన్యం
- బాన్సువాడ, జుక్కల్‌లో కార్యకర్తల విస్తృత సమావేశం



బాన్సువాడలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, వేదికపై బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

బాన్సువాడ రూరల్/ నిజాంసాగర్, మార్చి 26: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించి జహీరాబాద్ గడ్డపై బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. బాన్సువాడ, జుక్కల్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండేతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడారు. బీజేపీ నుంచి పోటీచేస్తున్న ఎంపీ బీబీ పాటిల్ పదేండ్లుగా చేసిందేమీ లేదని, ఐదేండ్లుగా ఎంపీగా పని చేసిన మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ చేసింది శూన్యమని దుయ్యబట్టారు. ఇద్దరూ ఏం ముఖం పెట్టుకొని ఓట్లు అడిగేందుకు వస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించిన ఎంపీ బీబీ పాటిల్ తన స్వార్థం కోసం కన్నతల్లిలాంటి పార్టీకి ద్రోహం చేశాడని అన్నారు. అధికారం కోసం బీజేపీలో చేరిన బేమాన్ బీబీ పాటిల్ అని, ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వస్తున్నాడని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ రాజకీయాలకు కొత్త అని, ప్రజలకు సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో ముందుకు వచ్చిన ఆయనకు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పార్టీ టికెట్ ఇచ్చాడని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థికి 50వేల మెజార్టీ రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. తన 40ఏండ్ల రాజకీయ ప్రస్థానంలో వెంట ఉండి పదవులు అనుభవించిన వారు స్వార్థ రాజకీయాల కోసం పార్టీకి వెన్నుపోటు పొడిచి వెళ్లిపోయారని, ప్రస్తుతం కడిగిన ఆణిముత్యాల్లాంటి నాయకులు, కార్యకర్తలు తన వెంట ఉన్నారని ఎమ్మెల్యే పోచారం అన్నారు. తాను పార్టీ మారుతున్నట్లు కొన్ని పనికిమాలిన యూట్యూబ్ చానెళ్లు అసత్య ప్రచారం చేస్తున్నాయని, ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్ పార్టీ మారే ప్రసక్తే లేదని కుండబద్ధలు కొట్టి చెప్పారు. కేసీఆర్ హయాంలో బాన్సువాడ నియోజకవర్గాన్ని అద్దంలా తయారు చేశానని అన్నారు. పదవులు అనుభవించి పార్టీలు మారే వ్యక్తిని కాదని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంటే తాను ఉంటానని తెలిపారు.

**ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్..**

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే పోచారం విమర్శించారు. వారిచ్చిన హామీలు 420హామీలని అభివర్ణించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని ప్రజలకు పిలునిచ్చారు. తాను ఎమ్మెల్యేగా, గాలి అనిల్ కుమార్ ఎంపీగా ఈ ప్రాంత అభివృద్ధికి కోసం పనిచేస్తామని తెలిపారు. బ్రాడ్‌గేజ్ రైల్వేలైన్‌ను తీసుకొచ్చి పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు.

## ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా..



ప్రజలకు సేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చానని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా తనను ప్రకటించడం సంతోషంగా ఉందని గాలి అనిల్ కుమార్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సహకారంతో జహీరాబాద్ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, ప్రజలు కారుగుర్తు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. బాన్సువాడకు రైల్వేలైన్ తీసుకొచ్చే బాధ్యత తనదేనని అన్నారు. జహీరాబాద్‌కు వచ్చిన నిమ్జ్ లో స్థానికులకే ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటానని చెప్పారు.

## బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం, బలగం



బీఆర్ఎస్ పార్టీకి కోట్ల మంది కార్యకర్తలే బలం, బలగమని డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. ప్రజల్లో పలుకుబడి లేని కొందరు నాయకులు పార్టీ మారితే వచ్చే నష్టం ఏమీలేదని అన్నారు. బాన్సువాడ అంటేనే పోచారం అడ్డా అని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మోహన్ నాయక్, రాజేశ్వర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, నేతలు దుద్దాల అంజిరెడ్డి, బద్యానాయక్, జంగం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## బీబీపాటిల్ వల్లే ఓడిపోయా...



నిజాంసాగర్, మార్చి 26: తాను అతి స్వల్ప మెజార్టీతో ఓడిపోయానని, తన ఓటమికి ప్రధాన కారణం బీబీ పాటిల్, ఆయన కుటుంబసభ్యులే అంటూ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే రోదించాడు. పోచారం, తాను కలిసి కేసీఆర్‌ను ఒప్పించి బీబీపాటిల్‌కు ఎంపీ టికెట్ ఇప్పిస్తే ... అధికారం కోసం కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచాడని అన్నా రు. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. తన ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతానని షిండే స్పష్టం చేశారు.

# రూ.500 బోనస్ ఇచ్చి ధాన్యం కొనాలి..

## రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, మార్చి 26 : కాంగ్రెస్ ఇచ్చిన హామీలో భాగంగా క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించి యాసంగి వరి ధాన్యం కొనుగోలు చేయాలని, ఆ తర్వాతే ఎంపీ ఎన్నికల్లో ఓట్లు అడగాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయకుంటే ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. వేల్పూర్‌లోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ నాయకత్వంలో కాళేశ్వరం రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాంసాగర్‌కు నీళ్లను తీసుకొచ్చి రైతుల పంటలకు అందించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడు నెలలు కాలేదు, రైతులు సాగునీరు అడుగుతుంటే పంటలకు నీళ్లు ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. పైపెచ్చు పోచంపాడ్ డ్యామ్ నుంచి వరదకాలువ ద్వారా అలోకేషన్ కన్నా ఎక్కువ నీరు కిందికి తరలిస్తూ ఇక్కడి రైతాంగానికి అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి ఇక్కడి కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. కప్పలవాగు, పెద్దవాగుల్లో అనేక చెక్ డ్యామ్‌లు తమ ప్రభుత్వ హయాంలో నిర్మించామని, ప్యాకేజీ 21 ద్వారా కప్పలవాగు, పెద్దవాగులో నీళ్లు వదిలితే వాగు వెంట ఉన్న బోర్లలో నీళ్లు వచ్చి సుమారు 40వేల ఎకరాలకు మేలు చేకూరేదన్నారు. వాగుల్లో 0.5 టీఎంసీల నీరు వదలమని ఎన్నిసార్లు రైతుల తరఫున విన్నవిస్తూ లేఖలు రాసినా ఈ చెవిటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇదీ రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 110 రోజులు కూడా గడిచిందని, వెంటనే రైతు రుణమాఫీ చేయాలన్నారు. అప్పులు కట్టాలని రైతులకు బ్యాంకు అధికారులు లీగల్ నోటీసులు ఇస్తున్నారని, రేవంత్‌రెడ్డి ఏం చెప్పారో తమకు సంబంధం లేదని, రుణాలు కట్టాల్సిందేనని రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. రైతులెవరూ బ్యాంకు రుణాలు కట్టాల్సిన అవసరం లేదని, రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలం వెల్లదీస్తే ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని ఎండగడతామని హెచ్చరించారు. హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి ఓట్లు ఎందుకు వేయాలో రైతన్నలు ఒకసారి ఆలోచించాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్, శేఖర్‌రెడ్డి, ఎంపీపీలు బీమా జమున, జడ్పీటీసీలు తలారి గంగాధర్, నాయకులు నర్సారెడ్డి, మిట్టాపల్లి మహిపాల్, సామ మహిపాల్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో ఉద్యోగులు

## ఉమ్మడి జిల్లాలో కలకలం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్

కమ్మర్‌పలి/భిక్కనూరు, మార్చి 26: ఏసీబీ దాడుల్లో ప్రభుత్వ ఉద్యోగులు తరచూ పట్టుబడుతున్నా.. తీరు మారడం లేదు. తాజాగా ఉమ్మడి జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారుల దాడులు కలకలం సృష్టించాయి. పంచాయతీ రాజ్ శాఖకు చెందిన ఇద్దరు ఉద్యోగులు తోటి ఉద్యోగి వద్ద లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. బదిలీపై వెళ్లిన మండల పంచాయతీ అధికారికి సర్వీస్ బుక్ ఇచ్చేందుకు ఎంపీడీవో లంచం డిమాండ్ చేయగా.. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో పక్కా ప్లాన్ వేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కమ్మర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ మంగళవారం విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం... కమ్మర్‌పల్లి ఎంపీవోగా పనిచేసిన బాగయ్య ఇందల్వాయి మండలానికి బదిలీపై వెళ్లాడు. దీంతో తన ఎస్ఆర్ బుక్ ఇవ్వాలని అప్పటి ఎంపీడీవోగా ఉన్న సంతోష్‌రెడ్డిని కోరగా రూ.10వేలు డిమాండ్ చేశాడు. కొన్నిరోజులకే ఎంపీడీవో సంతోష్‌రెడ్డి సైతం కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌కు బదిలీపై వెళ్లాడు. దీంతో తన సర్వీస్ బుక్ గురించి సీనియర్ అసిస్టెంట్ హరిబాబును అడగ్గా.. డబ్బులు ఇవ్వనిదే బుక్ ఇవ్వొద్దని ఎంపీడీవో సంతోష్‌రెడ్డి ఆదేశించాడని సమాధానం ఇచ్చాడు. దీంతో బాగయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పక్కా పథకం ప్రకారం.. బాగయ్య మంగళవారం ఎంపీడీవో సంతోష్‌రెడ్డికి ఫోన్‌చేసి తన ఎస్ఆర్ బుక్‌ను ఇప్పించాలని కోరాడు. బాగయ్య బతిమిలాడడంతో డబ్బులు కొన్ని తగ్గించి ఇవ్వాలని చెప్పాడు. సంతోష్ రెడ్డి చెప్పినట్లుగానే సీనియర్ అసిస్టెంట్ హరిబాబుకు బాగయ్య రూ. 8వేలు ఇవ్వగానే ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సంతోష్‌రెడ్డి ఆదేశాలతోనే తాను డబ్బులు తీసుకున్నట్లు ఏసీబీ అధికారులకు చెప్పడంతో ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


## ఏప్రిల్ 1 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

కంఠేశ్వర్, మార్చి 26: ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో సర్కారు వారి నిర్లక్ష్యమంటూ నమస్తే తెలంగాణ దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఏప్రిల్ 1 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచనున్నట్లు నిజామాబాద్ అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ వెల్లడించారు. సంబంధిత అధికారులు, సిబ్బందితో మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

**కామారెడ్డిలో 347 కొనుగోలు కేంద్రాలు..**

కామారెడ్డి, మార్చి 26: యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులతో మంగళవారం మాట్లాడారు. కామారెడ్డి కలెక్టర్ జితేశ్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో 347 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా గట్టి నిఘా పెడుతున్నామని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తెలిపారు.



జగిత్యాల జిల్లాలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే సంజయ్

# అర్వింద్ సోషల్ మీడియా యాక్టర్

## ఐదేండ్లలో ఆయన చేసింది శూన్యం

### నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గోవర్ధన్ రెడ్డి

### జగిత్యాల నియోజకవర్గంలో ప్రచారానికి శ్రీకారం

జగిత్యాల, మార్చి 26, (నమస్తే తెలంగాణ)/జగిత్యాల రూరల్: 'నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఒక సోషల్ మీడియా యాక్టర్. కేంద్రంలో వారి పార్టీ అధికారంలో ఉన్న తన సెగ్మెంట్ పరిధిలో ఐదేండ్లలో పది రూపాయల పనిచేయలే. పార్టీ అధినేత కేసీఆర్, కేటీఆర్, కవితలను విమర్శించడం, అడ్డదిడ్డంగా మాట్లాడడం తప్ప ఆయనకు ఏది చేతకాదు' అని నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గోవర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులకు, బీజేపీ లీడర్లకు షుగర్ ఫ్యాక్టరీ అంశం ఎన్నికల స్టంట్‌గా మారిందని విమర్శించారు. షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తమని మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అనడం ఆశ్చర్యంగా ఉందని.. అయినా ఫ్యాక్టరీ పాత డోర్లు తెరవడం తప్ప వారు చేసేదేంలేదని ఎద్దేవా చేశారు. నిజామాబాద్ లోక్‌సభ నుంచి పోటీ చేయాలని చూస్తున్న మాజీ మంత్రి, పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాటలు ప్రజల చెవిలో పూలు పెట్టేలా ఉన్నాయని విమర్శించారు. పార్లమెంట్‌లో తెలంగాణ వాణి బలంగా వినిపించాలన్నా, తెలంగాణ ఆత్మగౌరవం నిలబడాలన్న బీఆర్ఎస్ అభ్యర్థులు గెలువాల్సిందేనని చెప్పారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని పౌలస్తేశ్వరాలయంలో పూజలు చేసి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం జగిత్యాల పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందుల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో గులాబీ జెండా ఎగురేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. తాను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతం తరఫున ప్రశ్నించే గొంతుక అవుతానని స్పష్టంచేశారు. నిజామాబాద్ నియోజకవర్గ ప్రజలు అర్వింద్‌ను ఎంపీని చేసింది అభివృద్ధి చేయాలనే తప్పా, కేసీఆర్, కేటీఆర్, కవితలను తిట్టడానికి కాదని మండిపడ్డారు.